## నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

వంటింటిలోన వార్చిన గంజిని
నేలపాలు జేయు నేటి తరము
రెస్టరెంటులోన రెచ్చిపోయి కుడుచు
కార్న్ణసూపులెల్ల కాంక్షతోడ

మీ
విజయప్రసాద్ నలువాసు
తెలుగు బోధకులు, కవి

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

RNI - TELTEL/2023/87644



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 141 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | 18-8-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00


**తమిళనాడు ఓబీసీ నేతను ఎంపిక చేసిన బీజేపీ**

## ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా

# సీపీ రాధాకృష్ణన్

**తమిళనాడు ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ఎంపిక**



- ఆర్ఎస్ఎస్ నేపథ్యం.. గవర్నర్‌గా విశేష అనుభవం
- ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా సీపీ బాధ్యతలు
- అభ్యర్థిని ఇంకా ప్రకటించని ఇండియా కూటమి
- నామినేషన్ దాఖలుకు ఈ నెల 21 ఆఖరు తేదీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

వచ్చే నెల 9న జరిగే ఉప రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి ఎన్‌డీఏ కూటమి తమ అభ్యర్థిని ప్రకటించింది. మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ (67)ను తమ అభ్యర్థిగా బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశంలో ఎంపిక చేసినట్టు కూటమికి నేతృత్వం వహిస్తున్న బీజేపీ ఆదివారం వెల్లడించింది. తమిళనాడుకు చెందిన రాధాకృష్ణన్‌కు ఆర్‌ఎస్‌ఎస్ నేపథ్యంతో పాటు రాజకీయాల్లో విశేష అనుభవం ఉంది. వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆ రాష్ట్రానికి చెందిన అభ్యర్థిని ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేసి ఉంటారని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఉప రాష్ట్రపతి ఎన్నిక విషయంలో తాము విపక్షాలతో కూడా సంప్రదిస్తున్నామని, ఉప రాష్ట్రపతిని ఏకగ్రీవంగా

-మిగతా 2 లో





## 21న ఓయూలో హాస్టల్స్ ప్రారంభం

- ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరు
- సీఎం చేతుల మీదుగా ప్రారంభించే హాస్టల్స్ అదనపు వసతిని సమకూర్చనున్నాయి.
- ఇప్పటికే ఓయూలో ఉన్న 25 హాస్టళ్లలో 7,223 మంది విద్యార్థులు

**హైదరాబాద్ ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 21న జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరు కానున్నారు. ఈ మేరకు ఆదివారం ఆ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.కాశీం హైదరాబాద్ జూబ్లిహిల్స్ లోని సీఎం నివాసంలో ఆయన్ను కలిసి

-మిగతా 2 లో



## శిశువులకు జన్మనిచ్చే రోబో

- చైనాలో పరిశోధకుల అద్భుత సృష్టి
- ప్రపంచంలో తొలి ప్రెగ్నెన్సీ రోబో ఇదే
- వచ్చే ఏడాది చివరిలోగా ప్రొటోటైప్ రెడీ

**న్యూఢిల్లీ,**

చైనాలో పరిశోధకులు ప్రెగ్నెన్సీ హ్యూమనాయిడ్ రోబోను అభివృద్ధి చేస్తున్నారు. గర్భాన్ని ధరించడంతోపాటు కృత్రిమ గర్భంలో నవమాసాలు శిశువును మోసి, సురక్షితంగా ప్రసవించడం ఈ రోబో ప్రత్యేకత. ప్రపంచంలో తొలి 'ప్రెగ్నెన్సీ రోబో' ఇదే. సింగపూర్‌లోని నన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్సిటీ శాస్త్రవేత్త డాక్టర్ జాంగ్ కిఫెంగ్ నేతృత్వంలో ఈ రోబోను అభివృద్ధి చేస్తున్నట్టు చైనా మీడియా వెల్లడించింది.

-మిగతా 2 లో

# బీజేపీ ఓట్ చోర్

**ఈసీతో కలిసి కుతంత్రాలు**

- వారి కుట్రను ఇండియా బ్లాక్ అనుమతించదు
- ప్రమాదంలో రాజ్యాంగం.. ప్రజలు ఐక్యంగా ఉండాలి
- బీహార్‌లో 'ఓటర్ అధికార్ యాత్ర'ను ప్రారంభించిన రాహుల్ గాంధీ
- పాల్గొన్న ఖర్గే, లాలూ, తేజస్వీపలువురు ఇండియా బ్లాక్ నేతలు



**పాట్నా ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

పేదలకు ఉన్న ఏకైక శక్తి వారి ఓటు అనీ, అది కూడా చోరీకి గురవుతున్నదని బీజేపీ టార్గెట్‌గా కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. బీహార్‌లోని సాసారం నగరంలో 'ఓటర్ అధికార్ యాత్ర'ను ఆయన ప్రారంభించారు. బీహార్‌లో ఎన్నికల సంఘం (ఈసీ) చేపట్టిన ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా రాహుల్ ఈ నిరసన ర్యాలీని చేపట్టారు. 16 రోజుల పాటు జరిగే ఈ యాత్ర సెప్టెంబర్ 1న పాట్నాలో ర్యాలీతో ముగుస్తుంది. ఈ యాత్ర బీహార్‌లోని మొత్తం 25 జిల్లాలను కవర్ చేస్తూ 1300 కిలో మీటర్లు సాగనున్నది. ఈ యాత్రలో ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్

-మిగతా 2 లో

## యుద్ధానికి తెర పడుతుందా..

- నేడు ట్రంప్-జెలెన్‌స్కీ కీలక చర్చలు



**న్యూయార్క్, ఆగస్టు 17**

రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేందుకు జరుగుతున్న తీవ్ర ప్రయత్నాల్లో తుది అడుగుగా భావించే చర్చలకు అమెరికా వేదిక కానున్నది. ఇరు దేశా ల సంఘర్షణకు తెరదించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రం ప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, యూరోపియన్ నేతలు సోమవారం సమావేశం కానున్నారు. అలస్కాలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో చర్చల తర్వాత ట్రంప్ నేరుగా జెలెన్‌స్కీతో ఫోన్‌లో మాట్లాడారు. యుద్ధానికి ఒక ముగింపు పలికేందుకు సోమవారం చర్చలు జరపాలని ప్రతిపాదించగా, దానికి జెలెన్‌స్కీ అంగీకరించారు. దీంతో సోమవారం నాటి చర్చల్లో జెలెన్‌స్కీతో పాటు ఆయనకు మద్దతుగా పలువురు యూరోపియన్ నేతలు కూడా పాల్గొంటున్నారు. అలస్కా చర్చలు పూర్తి ఫలవంతంగా జరిగాయని ప్రకటించిన ట్రంప్, ఆ సమావేశంలో ఎలాంటి ఒప్పందం కుదరలేదని వెల్లడించారు.కాగా, తాను ట్రంప్‌తో సుదీర్ఘమైన, ముఖ్యమైన సంభాషణ జరిపానని, యూరోపియన్ నేతలు కూడా తనతో

-మిగతా 2 లో



## బీసీ రిజర్వేషన్లపై కార్యాచరణ

- 20 లేదా 21న.. పీఏసీ భేటీలో చర్చించాక తుది నిర్ణయం

**హైదరాబాద్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, దాంతో ముడిపడి ఉన్న 'బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం'పై ఎలా ముందుకెళ్లాలనే దానిపై త్వరలోనే అధికార కాంగ్రెస్ ఒక నిర్ణయం తీసుకోనుంది. ఇందుకోసం రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశం నిర్వహించి, అందులో చర్చించి, తుది నిర్ణయం తీసుకోనున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. రిజర్వేషన్లపై ఒక నిర్ణయానికి వస్తే స్థానిక ఎన్నికల నిర్వహణకు సంబంధించిన

-మిగతా 2 లో

## ఫ్యూచర్ సిటీకి ఫ్యూచర్ లేదు

**విజన్ లేని సర్కారు వల్ల ప్రజాధనం వృథా అయ్యింది**

- రియల్టీ కోసం వాడలేరని అసెంబ్లీలోనే హెచ్చరించిన!
- వేల కోట్ల రూపాయల ఫార్మాసిటీ పెట్టుబడులు వెనకి
- యువతకు లక్షల ఉద్యోగాలు రాకుండా పోయినయ్
- ఫార్మాసిటీ భూములపై ప్రభుత్వం స్పష్టతను ఇవ్వాలి
- లేనిపక్షంలో రైతుల తరఫున బీఆర్ఎస్ ఉద్యమం
- ప్రభుత్వానికి వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక



**హైదరాబాద్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదేపదే చెప్పిన ఊహాజనిత ఫ్యూచర్‌సిటీకి భవిష్యత్తు లేదని బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. తన కుటుంబసభ్యులు, స్నేహితుల ప్రయోజనాల కోసం హైదరాబాద్ ఫార్మాసిటీ భూముల్లో రియల్ఎస్టేట్ వ్యాపారం చేయాలనే రేవంత్‌రెడ్డి ఆకాంక్ష నెరవేరబోదని హెచ్చరించారు. ఫార్మాసిటీ భూముల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై కేటీఆర్ ఆదివారం ఒక ప్రకటనలో తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి విజన్ లేని నాయకుడని, ఆయన తీసుకుంటున్న నిర్ణయాల వల్ల ప్రజాధనం వృథా అవుతున్నదని ఆరోపించారు. ఫార్మాసిటీ కోసం భూములిచ్చిన రైతులు

-మిగతా 2 లో

## బురద రాజకీయాలు మానుకోండి

- వరద నీళ్లు ఒడిసిపట్టండి..
- రేవంత్ సర్కార్‌కు హరీశ్‌రావు హెచ్చరిక



**సిద్దిపేట**

కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయకుండా సముద్రం పాలు చేస్తున్న రైతు వ్యతిరేక కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. వరద నీళ్లను ఒడిసిపట్టి.. బురద రాజకీయాలను మానుకోవాలని రేవంత్ సర్కార్‌ను హరీశ్‌రావు హెచ్చరించారు.

-మిగతా 2 లో

## రాజగోపాల్‌రెడ్డి వినకపోతే వేటు తప్పదు

- కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ రవి



**హైదరాబాద్,**

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వివాదంపై కాంగ్రెస్ పార్టీ ఎంపీ, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి కీలక వ్యాఖ్యలు చేశారు. రాజగోపాల్‌రెడ్డి ఎంత చెప్పినా వినకుంటే వేటు తప్పదంటూ హెచ్చరించారు. ఆదివారం గాంధీభవన్‌లో క్రమశిక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజగోపాల్‌రెడ్డి అంశంపై పీసీపీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ తనతో చర్చించారని, దీనిపై సమాచారం తెప్పించుకొని

-మిగతా 2 లో

# 21న ఓయూలో హాస్టల్స్ ప్రారంభం

(మొదటి తరువాయి)

కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానించారు. ఓయూలో రూ.80 కోట్ల వ్యయంతో నిర్మాణమై 1,200 మంది విద్యార్థులకు వసతి కల్పించే రెండు హాస్టల్స్‌ను ప్రారంభించి, గిరిజన సంక్షేమం శాఖ ఆర్థిక సహాయంతో మరో 300 మంది విద్యార్థులకు వసతి కల్పించే రెండు కొత్త హాస్టల్స్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం సీఎం చేతులమీదు గా జరుగనున్నది. ఇప్పటికే ఓయూలో ఉన్న 25 హాస్టళ్లలో 7,223 మంది విద్యార్థులకు వసతి ఉండగా సీఎం చేతుల మీదుగా ప్రారంభించే హాస్టల్స్ అదనపు వసతిని సమకూర్చనున్నాయి. ఇదే కార్యక్రమంలో దాదాపు రూ.10 కోట్ల నిధులతో డిజిటల్ లైబ్రరీ రీడింగ్ రూం పనులకు కూడా సీఎం ప్రారంభించనున్నారు. అదే రోజు ఓయూలో ఉన్న టాగూర్ ఆడిటోరియంలో వెయ్యి మంది ప్రొఫెసర్లను, విద్యార్థులను ఉద్దేశించి ”తెలంగాణ విద్యా రంగంలో రావాల్సిన మార్పులు-ప్రభుత్వ ప్రణాళిక” అనే విషయంపై సీఎం ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొననున్నారు. గడిచిన 20 ఏళ్ల కాలంలో ఓయూలోకి ముఖ్యమంత్రి హౌదాలో వచ్చి ప్రసంగించనున్న తొలి సీఎం రేవంత్ రెడ్డియేనని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ”సీఎం రీసెర్చ్ ఫెలో షిప్ ” తో పాటు విదేశీ పర్యటనకు వెళ్లే విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించే పథకాన్ని సీఎం చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు వీసీ తెలిపారు.

# శిశువులకు జన్మనిచ్చే రోబో

(మొదటి తరువాయి)

నెలలు నిండకుండా జన్మించే శిశువుల సంరక్షణ కోసం ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఇంక్యుబేటర్ల కంటే ఈ రోబో చాలా భిన్నమైనది. గర్భాన్ని ధరించడం మొదలుకొని శిశువు జననం వరకు మొత్తం గర్భధారణ ప్రక్రియను ఈ రోబో అనుకరిస్తుంది. అంటే గర్భధారణ నుంచి ప్రసవం వరకు శిశువు పూర్తిగా హ్యూమనాయిడ్ రోబోలోని టెక్ గర్భంలో పెరుగుతుంది. ఈ ప్రాజెక్టులో కృత్రిమ గర్భ సాంకేతికత (ఆర్టిఫిషియల్ ఊంబ్ టెక్నాలజీ) ప్రధానమైనది. రోబో బొడ్డులో అమ్నియోటిక్ ద్రవంతో నింపిన కృత్రిమ గర్భం మానవ గర్భాన్ని అనుకరిస్తూ పిండం పెరుగుదలకు అనువైన పరిస్థితిని కల్పిస్తుంది. సహజంగా జన్మించే శిశువుకు జరాయువు (ప్లాసెంటా) ద్వారా పోషకాలు అందినట్టు ప్రెగ్నెన్సీ రోబోలో కృత్రిమ గర్భానికి జత చేసిన ట్యూబ్ ద్వారా శిశువుకు పోషకాలు అందుతాయి. కృత్రిమ గర్భ సాంకేతికత ఇప్పటికే పరిణితి చెందిన దశలో ఉన్నదని, ఇప్పుడు దీన్ని రోబో ఉదరంలో అమర్చాల్సిన అవసరం ఉన్నదని, తద్వారా నిజమైన వ్యక్తి ఆ రోబోతో ఇంటరాక్ట్ అయి గర్భధారణకు, ఆ గర్భంలో పిండం పెరుగుదలకు వీలు కల్పించాల్సి ఉన్నదని డాక్టర్ జాంగ్ వివరించారు. నిజానికి ఇదేమీ పూర్తిగా కొత్త భావన కాదని, గతంలో కొందరు శాస్త్రవేత్తలు ఓ 'బయోబ్యాగ్'లో గొర్రెపిల్లను విజయవంతంగా పెంచారని, ఆర్టిఫిషియల్ ఊంబ్ ఆలోచనకు అప్పుడే బీజం పడిందని తెలిపారు. ప్రెగ్నెన్సీ రోబో ప్రొటోటైప్ (నమూనా) వచ్చే ఏడాది చివరి నాటికి సిద్ధమవుతుందని, అందుకు దాదాపు లక్ష యువాన్లు (రూ.12.96 లక్షలు) ఖర్చవుతుందని అంచనా.

# యుద్ధానికి తెర పడుతుందా..

(మొదటి తరువాయి)

కలిశారని, చాలా ముఖ్యమైన అంశాలు చర్చించినట్టు జెలెన్‌స్కీ తెలిపారు. రెండు దేశాల మధ్య యుద్ధానికి ముగింపు పలికేందుకు సోమవారం తాను యూఎస్‌కు బయలుదేరుతున్నట్టు ఆయన చెప్పారు. చర్చలకు ఆహ్వానం పలికిన ట్రంప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి అంతం పలికేందుకు, సాధారణ ప్రజల మరణాలకు ముగింపు పలికే దిశగా ట్రంప్‌తో సమగ్రంగా చర్చిస్తానని జెలెన్‌స్కీ సామాజిక మాధ్యమంలో పోస్ట్ పెట్టారు. ఉక్రెయిన్-రష్యా సంఘర్షణను తెరదించడానికి యూరోపియన్ దేశాలు సహకరించాలని ఆయన మరోసారి విజ్ఞప్తి చేశారు. అమెరికాతో పాటు యూరోపియన్ దేశాల నుంచి తమ భద్రతకు హామీ కోరుతున్నామన్నారు. సెక్యూరిటీ గ్యారంటీ కావాలని ఉద్ఘాటించారు.

**చర్చల్లో ఎవరెవరు?**

యూఎస్‌లో సోమవారం నాటి చర్చల్లో ట్రంప్, జెలెన్‌స్కీతో పాటు ఆయ నకు మద్దతుగా యూరప్ నేతలు కూడా పాల్గొంటున్నారు. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమాన్యుయల్ మాక్రాన్, జర్మన్ చాన్స్‌లర్ ఫ్రెడ్రిచ్ మెర్జ్, ఫిన్నిష్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్, యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడు ఉర్సుల వాండర్ లేయన్, నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే తదితరులు చర్చల్లో పాల్గొంటున్నారు.

# బీసీ రిజర్వేషన్లపై కార్యాచరణ

(మొదటి తరువాయి)

అంశంపైనా సమావేశంలోనే చర్చించనున్నట్టు సమాచారం. ఈ మేరకు పీఏసీ సమావేశాన్ని ఈ నెల 20 లేదా 21న నిర్వహించే అవకాశం ఉందని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. వాస్తవానికి 18వ తేదీనే క్యాబినెట్ భేటీ నిర్వహించి, ఆ తరువాత పీఏసీ సమావేశం పెట్టి ఒక నిర్ణయం తీసుకోవాలని భావించారు. కానీ రాష్ట్రంలో వారం నుంచి వానలు కురుస్తుండడం, మరో 2-3 రోజులపాటు భారీ వర్షాలు ఉండొచ్చన్న వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో వాయిదా వేశారు. ఇక.. 22న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్తున్నారు. ఆయన తిరిగొచ్చిన తరువాత.. 23 లేదా 24న క్యాబినేట్ భేటీ ఉంటుందని అధికారికవర్గాలు అంటున్నాయి. బీసీ రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికల నిర్వహణ పై ఈ సమావేశంలో ఒక నిర్ణయం తీసుకోనున్నారు. ఆ తరువాత అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. స్థానిక సంస్థలు, విద్య, ఉపాధి, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లులను ఇప్పటికే అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి పంపిన సంగతి తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ పార్టీ బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీ వేదికగా ధర్నా కూడా నిర్వహించింది. అయితే, కేంద్రం నుంచి దీనిపై ఇంకా సమాధానం రాలేదు. ఈ నేపథ్యంలో ఆ బిల్లులపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేయనున్నట్టు సమాచారం. అలాగే రిజర్వేషన్ల అంశంపై అన్ని పార్టీల వైఖరిని కూడా ప్రభుత్వం తెలుసుకోనుంది. కాగా.. వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు ఈ నెల చివరి వారంలో ప్రారంభమయ్యే అవకాశాలున్నట్టు సమాచారం. ఈసారి సభలో బీసీల రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికలతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కమిషన్ ఇచ్చిన నివేదిక కూడా ప్ర?ధానాంశం కానుంది. ఆ నివేదికను సభలో మొత్తం సభ్యులందరికి అందించి, దానిపై చర్చ పెట్టనున్నారు. అలాగే కాళేశ్వరం నిర్మాణ నుంచి కూలడం వరకు జరిగిన పరిణామక్రమాన్ని పవర్ పాయింట్ ప్రజంటేషన్ రూపంలో సభలోని సభ్యులకు వివరించే అవకాశం ఉందని కూడా తెలిసింది.

# ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్

(మొదటి తరువాయి)

ఎన్నుకోవడానికి సహకరించాలని వారిని కోరుతున్నామని బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు.

పార్లమెంట్ ఉభయ సభల్లో 786 మంది సభ్యులుండగా, ఉప రాష్ట్రపతిగా ఎన్నిక కావడానికి కనీసం 394 ఓట్లు అవసరం. అయితే ఎన్డీఏ కూటమికి రెండు సభల్లో కలిపి 422 ఓట్లు ఉన్నాయి. దీంతో ఆ అభ్యర్థి ఎన్నిక నల్లేరు మీద బండిగా భావిస్తున్నారు. కాగా, ఇంతకుముందు ఉప రాష్ట్రపతిగా పనిచేసిన జగదీప్ ధన్‌ఖడ్ కూడా ఆ పదవికిలోకి రాకముందు గవర్నర్‌గా పనిచేశారు. ఈ ఎన్నికకు నామినేషన్ దాఖలుకు ఆగస్టు 21 ఆఖరు తేదీ. ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులతో పాటు బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, ఉప ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖ నేతలు సీపీ రాధాకృష్ణన్ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొంటారని బీజేపీ వర్గాలు తెలిపాయి. కాగా, ఈ ఎన్నికల్లో తమ అభ్యర్థిని పోటీకి దింపేందుకు సోమవారం కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే కార్యాలయంలో సమావేశం కానున్నట్టు ఇండియా కూటమి తెలిపింది.

**తమిళనాడు మోదీ'గా గుర్తింపు**

ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికైన చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ 1957, అక్టోబర్ 20న తమిళనాడులోని తిరుప్పూర్‌లో జన్మించారు. తమిళనాడులో ప్రభావవంతమైన గౌండర్ సామాజిక వర్గానికి చెందిన ఈ ఓబీసీ నేతకు ఆర్ఎస్ఎస్ నేపథ్యంతో పాటు రాజకీయాల్లో సుమారు 40 ఏండ్ల అనుభవం ఉంది. తమిళనాడు మోదీగా ఆయనను పిలుస్తారు. 2003 నుంచి 2006 వరకు ఆయన తమిళనాడు బీజేపీ అధ్యక్షునిగా పనిచేశారు. విశేష రాజకీయ అనుభవం ఉన్న ఆయన తమిళనాడులో రెండు సార్లు ఎంపీగా చేశారు. మహారాష్ట్ర గవర్నర్‌గా 2024, జూలై 31న బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు 2023 ఫిబ్రవరి 18 నుంచి 2024 జూలై 30 వరకు జార?ండ్ గవర్నర్‌గా, 2024 మార్చి నుంచి జూలై వరకు తెలంగాణ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. పుదుచ్చేరి లెఫ్ట్‌నెంట్ గవర్నర్‌గా 2024 మార్చి నుంచి ఆగస్టు వరకు పనిచేశారు.

# బీజేపీ ఓట్ చోర్

(మొదటి తరువాయి)

ఖర్గే, బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి, ఆర్జేడీ కీలక నేత తేజస్వీ యాదవ్, సీపీఐ(ఎం-ఎల్) లిబరేషన్ నాయకులు దీపాంకర్ భట్టాచార్య వంటి ఇండియా బ్లాక్ నేతలు పాల్గొన్నారు. ఇప్పటికే 'ఓట్ చోరీ' పేరుతో కాంగ్రెస్ పార్టీ ఆందోళనలను నిర్వహించిన విషయం విదితమే. ఈ ప్రారంభోత్సవ సభలో రాహుల్ ప్రసంగించారు. బీజేపీ రాజ్యాంగాన్ని బలహీనపరుస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో విజయాలను సాధించటానికి అవకతవకలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. ” లక్షలాది మంది ఓటు హక్కును తొలగించటానికి బీజేపీ ఓటర్లను అణచివేస్తున్నది.

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ద్వారా ఓటర్ల జాబితాలను మార్చటం వంటి సందేహాస్పదమైన పద్ధతులను ఉపయోగిస్తున్నది. రాజ్యాంగం ప్రమాదంలో ఉన్నది. పేదలకు ఉన్న ఏకైక శక్తి వారి ఓటు. అది కూడా చోరీకి గురవుతున్నది” అని రాహుల్ అన్నారు. ఇలాంటి వ్యూహాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈసీతో కలిసి బీజేపీ ఎన్నికల్లో ఓట్లను దొంగిలిస్తోందనీ, ఇప్పుడిది ప్రపంచం మొత్తానికీ తెలుసు అని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లను దొంగిలించటానికి, వారి కుట్రలో విజయం సాధించటానికి ఇండియా బ్లాక్ అనుమతించబోదని చెప్పారు. ఓట్ల చోరీ ఆరోపణలపై ఈసీ తన నుంచి అఫిడవిట్ కోరిందనీ, బీజేపీ నేతలు కూడా ఇదే విధమైన ఆరోపణలు చేస్తే మాత్రం ఈ ప్రస్తావనను తీసుకురాలేదని రాహుల్ అన్నారు.

బీజేపీ, ఆరెస్సెస్‌లు రాజ్యాంగాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నాయనీ, ఇది రాజ్యాంగాన్ని కాపాడటానికి జరుగుతున్న పోరాటమని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లను దొంగిలిస్తున్నారనీ, బీహార్‌లో ఓట్లను దొంగిలించడానికి ఎస్ఐఆర్ ద్వారా ఓటర్లను తొలగించి, చేర్చడమే వారి కుట్ర అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభలో ఇండియా బ్లాక్ సత్తా చాటిందనీ, మహారాష్ట్రలో ఎగ్జిట్‌పోల్స్ సర్వేలోనూ ఇండియా బ్లాక్ విజయం సాధిస్తుందని చెప్పాయని, కానీ నాలుగు నెలల్లో కోటి మందికి పైగా ఓటర్లు చేరటంతో బీజేపీ గెలిచిందని చెప్పారు. ఓటర్లను చేర్చిన నియోజకవర్గాల్లో బీజేపీ విజయం సాధించిందని అన్నారు. కర్నాటకలోని ఒకే నియోజకవర్గంలో లక్షకు పైగా ఓట్లు తారుమార య్యాయని దర్యాప్తులో తేలిందనీ, ఓటర్లను మోసం చేశారని రాహుల్ ఆరోపించారు. ఈ యాత్రను ఆయన ప్రజాస్వామ్యాన్ని కాపాడే పోరాటంగా, రాజ్యాంగ విలువలను కాపాడే ఉద్యమంగా అభివర్ణించారు. ప్రజలు తమ ఓటు హక్కులను కాపాడుకోవాలని రాహుల్ పిలుపునిచ్చారు.

**రెండో స్వాతంత్ర్య పోరాటానికి సమానం : లాలూ**

ఎన్డీఏ బీహార్‌లో 65 లక్షల మంది ఓటర్ల ఓటు హక్కును కోల్పోయేలా చేసిన ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా ఓటర్ల అణచివేతను జరుపుతున్నదని ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోపించారు. ఈ సమావేశంలో అక్కడి జనసమూహాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ”మేము ప్రజాస్వామ్యం కోసం త్యాగాలు చేశాం. ఈ యాత్ర రెండో స్వాతంత్ర్య పోరాటానికి సమానమైన ఉద్యమానికి నాంది పలుకుతుంది” అని లాలూ అన్నారు.

**ఈసీ విఫలం : ఖర్గే**

ఈసీ అన్ని రికార్డులనూ అందుబాటులో ఉంచినప్పటికీ.. ఓటర్ల డేటాలో వ్యత్యాసాలను పరిష్కరించటంలో విఫలమైందని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ఆరోపించారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నంతకాలం రాజ్యాంగానికి ముప్పు పొంచి ఉన్నదని అన్నారు. సాధారణ పౌరుల ప్రజాస్వామ్య హక్కులను కాపాడటానికి ఈ యాత్ర 'చారిత్రక పోరాటం' అని ఆయన అభివర్ణించారు. ఈ యాత్ర పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాల కోసం జరిగే పోరాటమని తేజస్వీ యాదవ్ అన్నారు. బీజేపీ నిరంకుశ వ్యూహాలకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలను ఏకం చేయటం ఈయాత్ర లక్ష్యమని చెప్పారు.

# ఫ్యూచర్ సిటీకి ఫ్యూచర్ లేదు

(మొదటి తరువాయి)

మోసపోయారని ఆవేదన వ్యక్తంచేశారు.

**ఫ్యూచర్‌సిటీ ఊహాజనిత ప్రాజెక్టు**

కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫార్మాసిటీ ప్రాజెక్టును రద్దు చేసి, దాని స్థానంలో ఫ్యూచర్‌సిటీ అనే అవాస్తవ, ఊహాజనిత ప్రాజెక్టును ప్రవేశపెట్టారని కేటీఆర్ దుయ్యబట్టారు. నిర్లక్ష్య నాయకుడు రాష్ట్రాన్ని పాలిస్తే ఏమవుతుందో చెప్పడానికి ఫ్యూచర్‌సిటీ అనే ప్రచారం ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. భూసేకరణ చట్టం-2013 ప్రకారం.. ఒక నిర్దిష్ట ప్రజాప్రయోజనం కోసం సేకరించిన భూమిని ఇతరుల ప్రయోజనం కోసం రియల్‌ఎస్టేట్ ప్రాజెక్టులకు మళ్లించడం సాధ్యం కాదని స్పష్టంచేశారు. ఈ చట్టాన్ని ఉటంకిస్తూ, తాను రెండేండ్ల క్రితమే అసెంబ్లీలో ఈ విషయంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించానని గుర్తుచేశారు. అయినా, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వందల కోట్ల రూపాయలు పీఆర్ కోసం ఖర్చు చేసి, ఇప్పుడు తీవ్రమైన న్యాయపరమైన అడ్డంకులను ఎదురొంటున్నదని, చివరికి అధికారులు కూడా దీనిని అంగీకరిస్తున్నారని తెలిపారు.

# రాజగోపాల్‌రెడ్డి వినకపోతే వేటు తప్పదు

(మొదటి తరువాయి)



పరిశీలిస్తానని స్పష్టంచేశారు. మంత్రి పదవి విషయంలో రాజగోపాల్‌రెడ్డి పదే పదే ఘాటు వ్యాఖ్యలు చేస్తున్నారని, దీనిపై వివరాలు సేకరిస్తున్నామని, పూర్తి వివరాలు వచ్చాక వచ్చే వారం మరోసారి సమావేశమై చర్చిస్తామని చెప్పారు. ఇక వరంగల్ జిల్లా నేతల పంచాయితీపై నలుగురు సభ్యులతో కమిటీని నియమించనున్నట్టు తెలిపారు

# బురద రాజకీయాలు మానుకోండి

(మొదటి తరువాయి)



సిద్దిపేటలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం మోటార్లపై కాంగ్రెస్ కుట్ర పన్నింది. మోటార్లను ఆన్ అండ్ ఆఫ్ చేస్తున్నారు. అవేమన్న మీ ఇంట్లో ఉండే మోటార్లు అనుకున్నారా? అలా చేస్తే మోటార్లు పాడైతాయి. బేరింగ్లు పోతాయి.. వేలకోట్ల నష్టం వాటిల్లుతుంది. ఈ విషయంపై బీహెచ్ఈఎల్ కూడా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. మోటార్లు పనికిరాకుండా అయితే మళ్లీ ఆ బద్నాం బీఆర్ఎస్ పార్టీపై వేయాలని చూస్తున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్ రెడ్డికి, ఉత్తం కుమార్ రెడ్డికి నీళ్ల విలువ తెలియదు. కాంగ్రెస్ ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర రైతాంగానికి తీవ్రమైన నష్టం జరుగుతున్నది. కట్టిన ఇల్లు పెట్టిన పొయ్యిలాగా కాళేశ్వరం ప్రాజెక్టు ఉంటే, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లను సముద్రంలోకి వదులుతూ ప్రాజెక్టును పడావు పెట్టింది. ఇప్పటికైనా బురద రాజకీయాలు మాని వరద నీటిని ఒడిసి పట్టండి అని హరీశ్‌రావు హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర రైతాంగానికి నష్టం కలుగుతున్నది. ఉన్న వ్యవస్థను నడపడం కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడం లేదా..? కమీషన్లకు, వాటాలు పంచుకోవడానికి సమయం సరిపోతలేదా..? రైతు ప్రయోజనాల కంటే రాజకీయాలే ముఖ్యమా ? నంది మేడారంలో ఖటక ఒత్తితే రోజుకి రెండు టీఎంసీల నీళ్లు వచ్చి మిడ్ మానేరులో పడతాయి. వారం రోజుల కిందనే ఈ విషయాన్ని ఉత్తంకుమార్ రెడ్డికి తెలుపుతూ ఉత్తరం రాశాను. అన్నపూర్ణ రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లు ఖాళీగా ఉన్నాయి. చెరువులన్నీ ఖాళీగా ఉన్నాయి. నీళ్లను ఒడిసి పట్టండి. వెంటనే మోటర్లు ఆన్ చేయండి అని ప్రభుత్వానికి విన్నపం చేశాను. దురదృష్టం ప్రభుత్వం మోటర్లు ఆన్ చేయలేదు. ఇప్పుడు ఎల్లంపల్లి గేట్లెత్తి నీళ్లను సముద్రంలోకి వదులుతున్నారు అని హరీశ్‌రావు మండిపడ్డారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ క్రిమినల్ నెగ్లిజెన్సీ.. నీళ్ల విలువ రైతులకు తెలుస్తది.. ఉత్తంకుమార్ రెడ్డికి, రేవంత్ రెడ్డికి తెలియదు. కేసీఆర్ కేంద్ర మంత్రిగా ఉన్నా, ముఖ్యమంత్రిగా ఉన్నా వ్యవసాయం చేసే ఒక రైతు. ఆయన రైతు గనుక ప్రతి చుక్కను ఒడిసిపట్టి నీళ్లను రైతులకు అందించాడు. మీరు ఎన్నడు వ్యవసాయం చేయలేదు అందుకే మీకు నేల విలువ తెలియదు. ఈ రోజు కృష్ణా, గోదావరి నీళ్లు సముద్రం పాలయితుంటే గుడ్లప్పగించి రేవంత్ రెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి చూడడం తప్ప ఏం చేయడం లేదు. కాంగ్రెస్ సర్కార్ నేరపూరిత నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర రైతాంగానికి తీవ్రమైన నష్టం జరుగుతున్నది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

## 2025 ఆగస్టు 18, సోమవారం తెలుగు పంచాంగం




మాసం - పక్షం
శ్రావణ మాసం (అమాంత)
కృష్ణపక్షం
తిథి
దశమి: ఆగస్టు 17 ఉద. 07:24 -ఆగస్టు 18 ఉద. 05:28 వరకు
ఏకాదశి: ఆగస్టు 18 ఉద. 05:28 -ఆగస్టు 19 ఉద. 03:42 వరకు
నక్షత్రం
రోహిణి: ఆగస్టు 17 మధ్యాహ్నం 03:15
- ఆగస్టు 18 మధ్యాహ్నం 01:02 వరకు
మృగశిర: ఆగస్టు 18 మధ్యాహ్నం 01:02
- ఆగస్టు 19 ఉదయం 10:59 వరకు
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:28- 5:15
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:55 - 12:46
అమృతకాలం: ఉదయం 10:18 - 11:52
అశుభ సమయాలు
రాహుకాలం: ఉదయం 7:38 - 9:13
యమగండం: ఉదయం 10:47 -12:21
దుర్ముహూర్తం: ఉదయం 12:49 - 1:41 మధ్యాహ్నం 3:20 - 4:11
వర్జ్యం: ఉదయం 5:41- 7:15

## సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


### అర్హులైన 10 మందికి 5.30 లక్షల సహాయం



**కరీంనగర్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆసుపత్రుల్లో చికిత్స పొందిన అర్హులైన వారికి సిఎంఆర్ఎఫ్ ద్వారా 5.30 లక్షల చెక్కులు పంపిణీ చేశారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. "ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఒక్కరికి ఏదో రూపంలో సహాయం అందుతుంది" అని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. హెల్ప్ డెస్క్ ద్వారా ప్రజలకు మేలు జరుగుతోందని తెలిపారు. మిర్జా ఉర్బాన, గాలిపల్లి అనూష, మంతెన విజయ, పుత్రమ్మ, రేష్మా తబసుమ్ తదితరులు చెక్కులు పొందారు. ఈ కార్యక్రమంలో శ్రవణ్ నాయక్, మూల రవీందర్ రెడ్డి, గుండాటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాడుగులలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట

### జైపాల్ యాదవ్, గోలి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజలు



**మాడుగుల, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కలకొండ గ్రామంలో మాజీ సర్పంచ్ గొర్రె పవన్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు.
ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, మాజీ సర్పంచులు జంగయ్య గౌడ్, ఐజాక్ కృష్ణారెడ్డి, చందు రెడ్డి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 1న సి.పి.ఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభ

### పాత పెన్షన్ పునరుద్ధరణకు ఉద్యమం

**హైదరాబాద్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సి.పి.ఎస్ రద్దు, పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం సెప్టెంబర్ 1న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ సి.పి.ఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లింగమొల్ల దర్శన్ గౌడ్ తెలిపారు. 'వృద్ధాప్యంలో ఉద్యోగులు ఆత్మగౌరవంతో జీవించాలి. సి.పి.ఎస్ రద్దు వరకు రాజీలేని పోరాటం కొనసాగుతుంది" అని పేర్కొన్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె. రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నాగవెల్లి ఉపేందర్ మాట్లాడుతూ, "రెండు లక్షల పైచిలుకు ఉద్యోగ కుటుంబాలు పాత పెన్షన్ కోసం ఎదురుచూస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ప్రకటన చేయాలి" అని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో లెక్కల వీరేశం, మంగ నర్సింహులు, మారం లింగారెడ్డి, భూలక్ష్మి, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ అభివృద్ధికి పాండు సేవలు చిరస్మరణీయం

### 81వ జయంతి సందర్భంగా ఘన నివాళులు



**చింతల్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కుత్బుల్లాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్, రాజకీయ పితామహులు కెఎం. పాండు 81వ జయంతి వేడుకలు చింతల్ ప్రధాన రహదారిలోని కెఎం. పాండు మార్గ్ వద్ద ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ కూన గౌరీష్ పారిజాత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ నాయకులు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు పాల్గొన్నారు. విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించిన అనంతరం, నాయకులు మాట్లాడుతూ "పాండు గారు ప్రజల సంక్షేమం కోసం జీవితాంతం కృషిచేసిన మహోన్నత నేత. ఆయన సేవలు కుత్బుల్లాపూర్ అభివృద్ధికి బాట చూపాయి" అని పేర్కొన్నారు. "ఆయన బాటలోనే నేడు ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ప్రజా సంక్షేమం కోసం శ్రమిస్తూ, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారు" అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎస్ అంతమే లక్ష్యంగా పీఆర్‌టీయూ మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ



**వనపర్తి, ఆగస్టు 17 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సీపీఎస్ నిర్మూలన లక్ష్యంగా పీఆర్‌టీయూ చేపట్టిన మహాధర్నా పోస్టర్‌ను ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పేర్ని వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయులు, ఉద్యోగులకు భారం అవుతున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (CPS)ఌ రద్దు చేసి, ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (OPS) అమలు చేయించేందుకు పీఆర్‌టీయూ కట్టుబడి ఉందన్నారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 1న హైదరాబాద్ ఇందిరా పార్కులో ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాలో అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోరెడ్డి బౌద్ధారెడ్డి, ప్రధాన కార్యదర్శి సూర చంద్రశేఖర్, టీజాక్ జిల్లా కన్వీనర్ సూగూరు వరప్రసాద్ రావు, సీపీఎస్ఈయూ జిల్లా నాయకులు మద్దిలేటి, రాజేంద్రప్రసాద్, మోహన్ బాబు, మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర-జిల్లా బాధ్యులు, కార్యకర్తలు, సంఘ శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## టైలర్ సువర్ణకు రావుల ఆర్థిక సహాయం



**వనపర్తి, ఆగస్టు 17( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వనపర్తి పట్టణం 9వ వార్డుకు చెందిన బొడ్డుపల్లి సువర్ణ టైలర్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఇటీవల ఆమె అనారోగ్యంతో చికిత్స పొందుతున్న విషయం మాజీ కౌన్సిలర్ నందిమల్ల శారద రావుల చంద్రశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకురావగా, స్పందించిన రావుల 5,000 ఆర్థిక సహాయం అందించారు అని నందిమల్ల శారద తెలిపారు.

## చదివే పిల్లలను ప్రోత్సహించాలి

### యాచారం ఎస్హెచ్ఓ నందీశ్వర్ రెడ్డి



**యాచారం, ఆగస్టు 17 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)** : యాచారం మండలం మాల్ గ్రామపంచాయతీ పరిధిలో యాచారం ఎస్హెచ్ఓ నందీశ్వర్ రెడ్డి పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో ఓ ఇంటి వద్ద ఆదివారం సెలవు రోజు ఇంటి ముందు కూర్చుని చదువుతున్న సమయంలో గమనించిన యాచారం ఎస్ హెచ్ ఓ నందీశ్వర్ రెడ్డి పెట్రోలింగ్ వాహనం ఆపి ఆ అమ్మాయితో కాసేపు ముచ్చటించి అమ్మాయి చదువుతున్న పుస్తకం తీసుకొని చూశారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత చదువులు చదివి మీ తల్లిదండ్రులకు విద్య నేర్పిన ఉపాధ్యాయులకి మంచి పేరు తేవాలని ఆశీర్వదించారు. చిన్న బహుమతిని అందజేశారు.

## విశాల్‌కు ఆవోప గోల్డ్ మెడల్ మెరిట్ అవార్డు




**ఎలిగేడు, ఆగస్టు 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పాలీసెట్‌లో ప్రతిభ కనబరిచిన తాటి పెల్లి విశాల్‌కు ఆవోప గోల్డ్ మెడల్ మెరిట్ అవార్డు లభించింది. ఆదివారం కరీంనగర్ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ కాలేజ్ హెచ్ఓడీ వంగల శ్రీనివాస్ చేతుల మీదుగా అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆవోప అధ్యక్షుడు నలుమాచు సుదర్శనం, ప్రధాన కార్యదర్శి వోల్లాల సత్యనారాయణ, కోశాధికారి కట్కూరు చంద్రశేఖర్, మెరిట్ అవార్డు కన్వీనర్ అక్కినపల్లి శివ, భరోసా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కినేపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష గాంధీ విగ్రహాల ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ



**ఆమనగల్, ఆగస్టు 17(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
స్వదేశీ, స్వలంబన, శాంతి, సుస్థిరాభివృద్ధి లక్ష్యంగా అక్టోబర్లో నిర్వహించనున్న లక్ష గాంధీ విగ్రహాల జాతీయ సమ్మేళనం పోస్టర్‌ను ప్రముఖ సంఘ సేవకులు పాపిశెట్టి రాము ఆదివారం ఆవిష్కరించారు. గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ స్వర్ణోత్సవాల సందర్భంగా "ఇంటింటా గాంధీ ప్రతి హృదయంలో శాంతి" నినాదంతో స్వదేశీ మేళా, చరఖాల ప్రదర్శన, గాంధీ సాహిత్య కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ "ప్రతి ఇంటిలో గాంధీ భావజాలం ఉంటే, ఆ ఇల్లు ప్రశాంతంగా మారుతుంది. వందకు పైగా దేశాల్లో గాంధీ తత్వం వర్ధిల్లుతోంది" అని పేర్కొన్నారు. అక్టోబర్‌లో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో 6 రోజుల పాటు గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు, లక్ష విగ్రహాల ప్రదర్శన, వెయ్యి చరకాల, లక్ష పుస్తకాల ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు గాంధీ గ్లోబల్ సాహిత్య అధ్యక్షుడు కే. గోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లె శ్రీనివాస్ గౌడ్, శ్రీను నాయక్, భాస్కర్, రమేష్, రాకేష్, గోపాల్, శివ, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్

### దేవేందర్ నగర్‌లో ఘనంగా 375వ జయంతి వేడుకలు



**గాజులరామారం, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ బహుజన చక్రవర్తి శ్రీ శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 375వ జయంతి ఉత్సవాలు దేవేందర్ నగర్‌లో ఘనంగా జరిగాయి. నూతన గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం, సంఘం సభ్యులు శాలువాతో సత్కరించారు. పాపన్న గౌడ్ గారు తెలంగాణ తొలిరాజు. దొరల అరాచకాలను, మొగులాయి దౌర్జన్యాలను ఎదురించి ప్రజల హక్కుల కోసం పోరాడిన ధీరుడు" అని శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. "ఆయన రాజకీయ, సామాజిక సమానత్వానికి ప్రతీక. బహుజన ఆత్మగౌరవానికి నిలువెత్తు చిహ్నం" అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముద్దాపురం మాధన్ గౌడ్, సంఘం అధ్యక్షుడు పటేల్ గోపాల్ గౌడ్, ఉపాధ్యక్షుడు వెండి రవి, ప్రధాన కార్యదర్శి దొమ్మాట ప్రభాకర్ గౌడ్, కోశాధికారి రవి కుమార్ గౌడ్, కార్యనిర్వాహక అధికారి మైసగోని బాలరాజ్ గౌడ్, ఆల్వాల్ ఉపేందర్ గౌడ్, సభ్యులు రమేష్ బాబు గౌడ్, శివరాజ్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


## కృష్ణా నదిలోకి మూగజీవులను తోలుకుని వెళ్ళొద్దని హెచ్చరించిన తహసిల్దార్ శ్రీనివాసరావు

**ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రేపల్లె.
రేపల్లె మండలం లోగల కృష్ణా నది పరివాహ ప్రాంతాలలో ప్రజలను కృష్ణా నది వరద ప్రవాహం పెరుగుట వలన ప్రజలను కృష్ణా నదిలోకి వెళ్లకుండా మరియు వారి గేదెలను మేకలు గొర్రెలను కృష్ణా నదిలోకి తీసుకు వెళ్లరాదని గ్రామ రెవెన్యూ అధికారులకు కృష్ణానది పరివాహక ప్రజలకు టామ్ టామ్ ద్వారా తెలియజేయవలసినదిగా సంబంధిత అధికారులకు తెలియజేసిన తహసిల్దార్ ఎం శ్రీనివాసరావు

# లారీని ఢీకొట్టిన డీసీఎం

-కార్మికుడు మృతి
-దేవరకొండ వద్ద దుర్ఘటన





**దేవరకొండ, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చందంపేట మండలం భారత్ పెట్రోల్ బంక్ వద్ద ఆదివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. డిండి నుండి దేవరకొండ వైపు వస్తున్న వరి ధాన్యం లారీని, వెనుక నుండి వేగంగా వచ్చిన డీసీఎం గూడ్స్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జిన్నె చింత గ్రామానికి చెందిన కార్మికుడు భూతం లింగయ్య (45) వాహనంలో ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందాడు. మరో కార్మికుడు వడ్ల మల్ల రాఘవేందర్ మరియు డ్రైవర్ కుంటిగొర్ల సైదులు రక్త గాయాలతో బయటపడ్డారు.ప్రమాదం జరిగిన వెంటనే చందంపేట ఎస్ఐ లోకేష్ సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య ఇందిరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి కుమారుడు నిఖిల్ (16), కుమార్తె నికిత (17) ఉన్నారు.

## తపస్విని పాఠశాలలో కృష్ణాష్టమి సందడి





**వనపర్తి,ఆగష్టు 17 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తపస్విని పాఠశాలలో నర్సరీ చిన్నారులు రాధాకృష్ణ వేషధారణలో మెరిసి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల ను ఆకట్టుకున్నారు. చిన్నారుల ముద్దైన వేషధారణ చూసి అందరూ ఆనందించారు. వారిని అందంగా అలంకరించిన తల్లిదండ్రులు ఆ క్షణాలను ఫోటోలలో బంధించి సంతోషాన్ని పంచుకున్నారు.

## ఘనంగా ముత్యాలమ్మ బోనాలు



**కనగల్లు,ఆగస్టు 17( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కనగల్ మండలంలోని దోరేపల్లి గ్రామం లో శ్రావణమాసం సందర్భంగా ఆదివారం గ్రామదేవత ముత్యాలమ్మకు మహిళలు అధిక సంఖ్యలో ఊర బోనాలను సమర్పించారు. బోన మెత్తిన మహిళలు బొడ్రాయి వద్దకు చేరుకొని అటు నుంచి గ్రామ శివారులోని ముత్యాలమ్మ ఆలయానికి డప్పు చప్పులతో ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, పాడి -పంటలతో ఆనందంగా ఉండాలి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమంలో మహిళలు గ్రామ పెద్దలు యువకులు, ప్రజలు పాల్గొన్నారు..

## బీజేపీ నల్గొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా పకీరు మోహన్ రెడ్డి నియామకం



**నల్లగొండ, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బీజేపీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నల్గొండ పట్టణానికి చెందిన పకీరు మోహన్ రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో బీజేపీ పటిష్టత కోసం కృషి చేస్తానని చెప్పారు. గత బిఆర్ఎస్ పాలన మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ పాలన కూడా కొనసాగుతోందని ఆయన విమర్శించారు.

# దేశభక్తి పై మాట్లాడే నైతిక హక్కు బిజెపికి లేదు: భాస్కర్




**వనపర్తి ఆగస్టు 17( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):**
దేశభక్తి గురించి మాట్లాడే నైతిక హక్కు బిజెపికి లేదని, నిజమైన దేశభక్తులు కమ్యూనిస్టులని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ అన్నారు. ఆదివారం వనపర్తి లో సిపిఐ జిల్లా నేత కళావతమ్మ నివాస గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కమ్యూనిస్టులను ఏరువేస్తామని, వారి దేశభక్తిపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. 1925, డిసెంబర్ 26న ఉత్తరప్రదేశ్ కాన్పూర్ లో కమ్యూనిస్టు పార్టీ పురుడు పోసుకుందన్నారు. అప్పుడే ఆర్ఎస్ఎస్ కూడా పుట్టిందన్నారు. దేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని తొలిసారి డిమాండ్ చేసింది కమ్యూనిస్టులే అన్నారు. ప్రజలను సమీకరించి స్వాతంత్రం కోసం పోరాడిందన్నారు. ఆర్ఎస్ఎస్ లో ఒక్కరు కూడా స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొనలేదని, దేశభక్తిని గురించి మాట్లాడే నైతిక హక్కు వారికి లేదన్నారు. స్వాతంత్రం కోసం, తెలంగాణ విముక్తి కోసం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఎందరో కమ్యూనిస్టులు ప్రాణ త్యాగం చేశారన్నారు. ఆపరేషన్ కంగారు పేరుతో మార్చి 2026 నాటికి కమ్యూనిస్టులను ఏరివేస్తామని బండి సంజయ్ చెప్పటం దుర్మార్గమన్నారు. ఎర్రజెండాను అంతం చేసే శక్తి బీజేపీకి లేదన్నారు. బండి సంజయ్ తను వ్యాఖ్యలను ఖండించారు, ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, శ్రీరామ్, రమేష్, మోష, ఏఐవైఎఫ్ నేత లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మేడిగడ్డ తండాలో సుంకిరెడ్డి మొబైల్ హెల్త్ క్యాంప్

**ఆమనగల్, ఆగస్టు 17(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా మేడిగడ్డ తండాలో మొబైల్ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో టాస్క్- సీవోవో, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి గారి నేతృత్వంలో ఆదివారం ఈ శిబిరం విజయవంతంగా ముగిసింది. గ్రామంలోని 600 మందికి పైగా క్యాంప్‌ను సందర్శించగా, 400 మందికిపైగా ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మెడిహబ్ మొబైల్ క్లినిక్ ద్వారా సీబీపీ, క్రియాటినిన్, బిలిరుబిన్, కొలెస్ట్రాల్, గ్లూకోజ్ తదితర పరీక్షలు చేశారు. సుంకిరెడ్డి మాట్లాడుతూ "ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్నదే మా లక్ష్యం. ప్రతి మారుమూల గ్రామంలో ఇలాంటి ఉచిత శిబిరాలు నిర్వహిస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు మండ్లి రాములు, ఉప సర్పంచ్ మల్లేష్ నాయక్, నాయకులు పురుషోత్తం, చంద్రు నాయక్, కిషన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోచమ్మ బోనాలు





**యాచారం, ఆగస్టు 17 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
యాచారం మండల పరిధిలోని మేడిపల్లి గ్రామ దేవత పోచమ్మకు ప్రజలు బోనమెత్తారు. ఆదివారం గ్రామంలో ప్రతీ ఇంటి నుంచి బోనం తయారుచేసుకొని మహిళలు ఆలయానికి తరలివెళ్లారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. యువకుల కేరింతలు మధ్య బోనాలు, ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులంతా పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు. వర్షాలు బాగా కురిపించి ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో చిగురంత కృష్ణారెడ్డి, బుసు జంగారెడ్డి, లిక్కి వెంకట్ రెడ్డి, లిక్కీ కృష్ణారెడ్డి,దెంది మధుకర్ రెడ్డి ,కునిరెడ్డి మధుకర్ రెడ్డి, కేశవరెడ్డి అమ్మవారిని దర్శనం చేసుకున్నారు.

## కరీంనగర్‌లో ఆవోపా మెరిట్ అవార్డ్స

-100 మంది విద్యార్థులకు పురస్కారాలు, 250 మంది హాజరు




**కరీంనగర్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఆవోపా) ఆధ్వర్యంలో మెరిట్ అవార్డ్స్ కార్యక్రమం ఘనంగా జరిగింది. వివిధ కోర్సుల్లో ప్రతిభ కనబరిచిన 100 మంది విద్యార్థులకు బంగారు, వెండి, రజిత పతకాలు మరియు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు.ప్రధాన వక్తగా వంగళ శ్రీనివాస్ మాట్లాడుతూ, "మెరిట్ అవార్డు మీ సామర్థ్యానికి గుర్తింపు, మంచి అలవాట్లతో ఉత్తమ పౌరులుగా ఎదగండి" అని సూచించారు. ఆవోపా అధ్యక్షుడు నలుమాసు సుదర్శనం మాట్లాడుతూ, "పురస్కారాలు విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తాయి" అన్నారు.ఈ కార్యక్రమంలో 27 మంది దాతలు శాశ్వత సభ్యత్వం ద్వారా సహకరించారు. 250 మంది హాజరైన ఈ వేడుకను నలుమాచు చంద్రశేఖర్ నిర్వహించారు.

## మాన్యం భూములపై దళితుల విన్నపం

మందకృష్ణ మాదిగకు దేవరకొండ దళితుల ఫిర్యాదు



**దేవరకొండ, ఆగస్టు 17(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
దేవరకొండ శివారులోని సర్వే నం.346 బాల్వత ఇనాం మాన్యం భూములు దళితుల జీవనాధారంగా ఉన్నాయి. గత 70 ఏళ్లుగా కస్తూలో జీవిస్తున్న వీరి భూములు ప్రస్తుతం కొంతమంది అగ్రకులవర్ణాల వ్యక్తులు, మాజీ సైనికులు, అధికారుల అండతో కబ్జా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగకు దళితులు విన్నవించగా, "దళితులపై అమానుషం సరికాదు. కలెక్టర్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటాం" అని హామీ ఇచ్చారు. అంకూరి సుగుణయ్య, పొట్ట చంద్రమౌళి, మాతంగి శ్రీను, సత్యం, ఎం.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లోకి వెంకటాపూర్‌లో ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆహ్వానం



**వంగూరు, ఆగస్టు 17(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వంగూరు మండలం వెంకటాపూర్ మంచినోనిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు రామస్వామి, స్కైలాప్, నిరంజన్, జంగయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. అచంపేట్ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో ఆల్వాల్ రెడ్డి, రమేష్ గౌడ్, హరీష్ రెడ్డి, జనార్దన్, తిరుపతి రెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బాహాబాహీ



**వనపర్తి,ఆగష్టు 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పనిచేస్తున్న అంబటి రమేష్ సోషల్ మీడియాలో ప్రతిపక్షాలపై వ్యక్తిగత దూషణలు చేస్తున్నారని ఆరోపిస్తూ బిఆర్ఎస్ నాయకులు ఆదివారం కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ క్రమంలో కాంగ్రెస్ -బిఆర్ఎస్ నాయకుల మధ్య బాహాబాహీ చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎస్సై హరిప్రసాద్ పోలీసులు ఇరువర్గాలను శాంతింపజేశారు. అనంతరం బిఆర్ఎస్ నాయకులు అంబేద్కర్ చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. రమేష్‌పై రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## ముద్విన్‌లో పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణ

-పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్




**కడ్తాల్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ముద్విన్ గ్రామంలో ఆదివారం శ్రీ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఠాగూర్ బాలాజీ సింగ్, డా. విజితా రెడ్డి, యాట నరసింహ, తెలంగాణ ఉద్యమకారులు, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# బొమ్మకల్‌లో బీజేపీ శ్రమదానం

**రోడ్డు మరమ్మతులు, పాఠశాలలో శుభ్రత**



**కరీంనగర్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బొమ్మకల్ 6వ డివిజన్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. లారీ అసోసియేషన్ వద్ద స్టాపర్లు ఏర్పాటు, పిచ్చి మొక్కల తొలగింపు, రోడ్డు గుంతల నింపడం చేశారు. సాక్షి దినపత్రికలో వచ్చిన "చిట్టడవి కాదు చదువుల బడి" కథనానికి స్పందనగా, స్థానిక ప్రాథమిక పాఠశాలలో శుభ్రత కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ అధ్యక్షుడు అవుదుర్తి శ్రీనివాస్, రైల్వే బోర్డు మెంబర్ పాశం తిరుపతి, చిందం అశోక్, అసిరి తిరుపతి, కాల్వ రామచంద్రం, గాలిపెల్లి నారాయణ, పెద్ది లక్ష్మణ్, మెర్గవేని శ్రీకాంత్, నేరేళ్ల శశి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# "కమిషన్ల కక్కుర్తితో కాళేశ్వరం నిర్మాణం"

**బీఆర్ఎస్ విమర్శలకు కాంగ్రెస్ నేతల కౌంటర్**




**కరీంనగర్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీఆర్ఎస్ నేత వినోద్ కుమార్ చేసిన విమర్శలకు కాంగ్రెస్ నేతలు కౌంటర్ ఇచ్చారు. డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ నేతృత్వంలో పత్రికా సమావేశం నిర్వహించారు.
"కమిషన్ల కోసం కాళేశ్వరం నిర్మించారు. ప్రజలపై భారంగా మారింది",
"ఒక ఎకరానికి నీరు అందించేందుకు 46,632 ఖర్చవుతోంది",
"వినోద్ కుమార్ ప్రజలను మభ్యపెడుతున్నారు" అని నేతలు మండిపడ్డారు.
ఈ సమావేశంలో రామిడి రాజిరెడ్డి, వంగల విద్యాసాగర్, కంకణాల అనిల్, నూనె గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ శ్రీ పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన నోముల దయానంద గౌడ్



**యాచారం,ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
యాచారం మండల పరిధిలోని గడ్డ మల్లయ్య గూడ గ్రామంలో శ్రీ శ్రీ పోచమ్మ అమ్మవారి విగ్రహం పునర్ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారతీయ జనతా పార్టీ కాంటెస్ట్ ఎమ్మెల్యే నోముల దయానంద గౌడ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నోముల దయానంద గౌడ్ కు భారతీయ జనతా పార్టీ యాచారం మండల అధ్యక్షులు జరుపుల విజయ్ నాయక్ , బిజెపి సీనియర్ నాయకులు అంబోజు జగదీష్ యాదవ్ ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గౌర లక్ష్మయ్య, బాషయ్య , శ్రీకాంత్ రెడ్డి, సంతోష్ కుమార్, పల్లపు నరేష్, కొండాపురం నాగరాజు, పల్లపు రవీందర్, మరియు బిజెపి కార్యకర్తలు గడ్డ మల్లయ్య గూడ గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవితకు మెరిట్ అవార్డ్స్ ప్రేరణ

**ఆవోపా ఆధ్వర్యంలో 100 మందికి పురస్కారాలు**



**కరీంనగర్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఆవోపా) ఆధ్వర్యంలో మెరిట్ అవార్డ్స్ కార్యక్రమం ఘనంగా జరిగింది. వివిధ కోర్సుల్లో ప్రతిభ కనబరిచిన 100 మంది విద్యార్థులకు బంగారు, వెండి, రజిత పతకాలు మరియు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ప్రధాన వక్త మంగళ శ్రీనివాస్ మాట్లాడుతూ, "మెరిట్ అవార్డు మీ సామర్థ్యానికి గుర్తింపు, మంచి అలవాట్లతో ఉత్తమ పౌరులుగా ఎదగండి" అని సూచించారు. ఆవోపా అధ్యక్షుడు నలుమాసు సుదర్శనం మాట్లాడుతూ, "పురస్కారాలు విద్యార్థులకు భవిష్యత్తుకు ప్రేరణగా నిలుస్తాయి" అన్నారు. కార్యక్రమ నిర్వహణలో చిటుమల్ల శ్రీనివాస్, డా. కొల్లూరు రమేష్ సహకరించారు. 27 మంది దాతలు శాశ్వత సభ్యత్వం ద్వారా 11,116 విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో 250 మంది హాజరయ్యారు. నలుమాచు చంద్రశేఖర్ వందన సమర్పణతో కార్యక్రమాన్ని ముగించారు.

# భారతీయ జనతా పార్టీ నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులుగా వానం నరేందర్ రెడ్డి ఎన్నిక



**దేవరకొండ,ఆగష్టు 17.(నీలగిరి ఎక్స్ ప్రెస్ ).**
నల్లగొండ జిల్లా,డిండి మండలం కందుకూరు గ్రామానికి చెందిన వానం నరేందర్ రెడ్డి , నల్గొండ జిల్లా బిజేపి ఉపాధ్యక్షులుగా రెండవసారి ఎన్నిక కావడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూవిద్యార్థి దశలో ఎబివిపి లో పనిచేయటం జరిగిందని,రసాయన శాస్త్రంలో ఉన్నత విద్యను అభ్యసించి పరిశోదన రంగంలో ఉద్యోగం చేసి గత స్థానిక సంస్థల ఎన్నికలలో కందుకూరు గ్రామం నుండి తన భార్య సర్పంచ్ గా ఎన్నిక ఐన తరువాత తన ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజలకు అందుబాటులో వుంటూ డిండి మండల బిజేపి అధ్యక్షులు గా బాధ్యతలు నిర్వహిస్తూ మండలంలో పార్టీ పటిష్టతకు కృషి చేశారు .తన సేవలను గుర్తిస్తూ మార్చి 2024లో బిజేపి జిల్లా ఉపాధ్యక్షులు గా నియమించిన పార్టీ 2వ సారి తిరిగి బిజేపి జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించినందుకు రాష్ట్ర మరియు జిల్లా పార్టీకి కృతజ్ఞతలు తెలియజేస్తూ రాబోయే రోజులలో దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గం లో గ్రామ గ్రామానికి పార్టీని తీసుకెల్లి పార్టీ నిర్ణయాలను అమలు పరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు ఆవలంబిస్తే ప్రభుత్వనికి వ్యతిరేకంగా ప్రజల తరుపున పోరాడుతానని తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణ సమితి యొక్క లక్ష్యాలు మరియు మిషన్

- **లక్ష్యం**

సుస్థిరమైన, ఆరోగ్యకరమైన జీవనవాతావరణం కోసంపర్యావరణాన్ని రక్షిస్తూ, ప్రజల ఆరోగ్యం, ఆయుష్ష పెంపుకు కృషి చేయడం.

పర్యావరణ పరిరక్షణ సమితి
చెట్టు = అమ్మ
Reg No. 643/2025
Nurture Nature, Promote Wellness

**మిషన్**

- శాస్త్రీయ పద్ధతుల్లో పర్యావరణ పరిరక్షణ
- గాలి, నీరు, నేలపై కాలుష్య నివారణ
- విద్య, సాంకేతికతతో ప్రజల్లో అవగాహన
- యువతకు పది వేల ఉద్యోగ అవకాశాలు
- అభివృద్ధి -పర్యావరణాన్ని సమతుల్యంగా ముందుకు నడిపించడం
- మాదకద్రవ్యాల రహిత భారత దేశ ఆవిష్కరణ
- భారతీయ సాంప్రదాయాల విస్తృత ప్రచారం

# ఉత్సాహంగా గెలవలాంబ జాతర


**-ఉట్లు కోటే, మహా హారతితో ముగింపు**



**వంగూరు, ఆగస్టు 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వంగూరు మండల కేంద్రంలో శ్రీ గెలవలాంబ మత జాతర ఆదివారంతో ముగియనుంది. కృష్ణ, బలరాములతో ఉట్లు కోటే, అమ్మవారికి మహా హారతి కార్యక్రమాలతో జాతర ముగింపు జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ నాకినమోని శేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మురళి, సుమన్, జనార్దన్, నరేందర్ గౌడ్, మలేష్ యాదవ్, ఎల్లగౌడ్ తదితర కమిటీ సభ్యులు, వివిధ పార్టీ నాయకులు, గ్రామ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బోడిగ శోభ కుమారుని వివాహానికి హాజరైన ఎంపీ ఈటల

**వధూవరులను ఆశీర్వదించిన రాజేందర్**



**కరీంనగర్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బోడిగ శోభ కుమారుని వివాహానికి ఎంపీ ఈటల రాజేందర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# యాచారం మండలంలో పోచమ్మ బోనాల వైభవం

**మల్కిజ్‌గూడ, మొగులవంపులో ఘనంగా నిర్వహణ**





**యాచారం, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మల్కిజ్‌గూడ, మొగులవంపు గ్రామాల్లో ఆదివారం పోచమ్మ తల్లి బోనాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రజలు ఉపవాసాలతో బోనాలు వండి, ఆలయాల్లో నైవేద్యాలు సమర్పించి, ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.డప్పు వాయిద్యాలు, శివసత్తుల పూనకాలతో గ్రామదేవతల బోనాలు ఘనంగా సాగాయి. వర్షాలు పడాలి, పంటలు పండాలి, ఆరోగ్యంగా ఉండాలి అంటూ అమ్మవారిని మొక్కుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శారద శంకర్, కాంగ్రెస్ నాయకుడు దేంది సుధాకర్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు బోడ అబ్బయ్య, బిక్షపతి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ కోసం 20న భారీ ర్యాలీ

**అచ్చంపేటలో ఎమ్మెల్యే వంశీకృష్ణ పిలుపు**



**అచ్చంపేట, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం ఈనెల 20న భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ ప్రకటించారు.
అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంపస్‌లో జరిగిన బీసీ కుల సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ సాధించేందుకు తెలంగాణ ఉద్యమంలా పోరాటం అవసరం" అని పేర్కొన్నారు."ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీల కోసం ప్రత్యేకంగా కృషి చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మద్దతుతో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలి" అని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, బీసీ సంఘ నాయకులు కాశన్న యాదవ్, చరణ్ గౌడ్, శారదమ్మ, హరి నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బంజారాహిల్స్ లో ఘనంగా లక్ష్మీ నరసింహ స్వామి పూజ...

**పాల్గొన్న పిసిసి చీఫ్ మహేష్ కుమార్..**




**బంజారా హిల్స్, ఆగస్టు 17(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 లో కొలువైన స్వయం భూమి శ్రీ లక్ష్మీనరసింహస్వామి మరియు హరే కృష్ణ స్వామి పూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ డిసిసి అధ్యక్షులు డాక్టర్ సి.రోహిన్ రెడ్డి మరియు జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాటూరి రమేష్ పాల్గొనడం జరిగింది.

# గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సమావేశం...



**అంబర్పేట్, ఆగస్టు 17(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అంబర్పేట అసెంబ్లీ నియోజకవర్గం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఉత్సవ సమితి బిజెపి సంయుక్త కన్వీనర్ ఏడెల్లి అజయ్ కుమార్ ముఖ్యమైన నిర్వాహకులతో కలిసి పాల్గొనడం జరిగింది.

# స్నేహంలో డబ్బు పరీక్ష



## 73% కి చేదు అనుభవం!

**హైదరాబాద్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** జీవితంలో అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు కుటుంబ సభ్యుల తరువాత ముందుకొచ్చి అండగా నిలిచేది స్నేహితులే. అవసర సమయంలో డబ్బు సాయం చేయడంలోనూ చాలామంది ఫ్రెండ్సే ముందుంటారు. అయితే అప్పు ఇచ్చిన డబ్బు తిరిగి రాకపోవడం వల్లే అనేక స్నేహాలు బీటలు వారుతున్నాయంటూ తాజా సర్వే ఒకటి వెలుగులోకి తెచ్చింది. ఆ సర్వే వివరాల ప్రకారం అప్పు ఇచ్చిన డబ్బును కేవలం 27 శాతం మంది మాత్రమే తిరిగి రికవరీ చేసుకోగలిగారు. మిగతా 73 శాతం మంది మాత్రం "మనం ఇచ్చిన డబ్బు తిరిగి రాలేదు" అని వాపోయారు. దీంతో స్నేహం పేరు మీద ఇచ్చిన డబ్బే సంబంధాలను దెబ్బతీస్తోందని తేలింది. ఇంకా ఒక అంశం గమనార్హం. అప్పు ఇచ్చిన డబ్బు వసూలు చేయలేకపోవడం వల్ల సంబంధాలు చల్లబడుతున్నాయని, దూరాలు పెరుగుతున్నాయని సర్వేలో బయటపడింది. "స్నేహం అనేది విశ్వాసం మీద నడుస్తుంది. కానీ ఆ విశ్వాసాన్ని ధన సంబంధాలు దెబ్బతీస్తాయి" అని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**స్నేహం నిలకడగా కొనసాగాలంటే**

డబ్బు సంబంధాలు వీలైనంత దూరంగా ఉంచడమే శ్రేయస్కరం అని సలహా ఇస్తున్నారు. లేకపోతే స్నేహం బలహీనమైపోతుందని ఈ సర్వే హెచ్చరికగా నిలుస్తోంది.



## కనకదుర్గమాత జాతర మహోత్సవం ఘనంగా

రేలి కుల సేవా సంఘం ఆధ్వర్యంలో శోభాయాత్ర, పూజలు



**రామగుండం, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శ్రీశ్రీశ్రీ కనకదుర్గమాత జాతర మహోత్సవం రామగుండం నియోజకవర్గంలో వైభవంగా జరిగింది. శోభాయాత్ర, బోనాల సమర్పణ, పల్లకి ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో సాగాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాగూర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రేలి కుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహోత్సవానికి ఎస్సీ సెల్ అధ్యక్షుడు తాళ్లపల్లి యుగేందర్ ప్రత్యేక ఆహ్వానం అందించారు. "ఇటువంటి ఉత్సవాలు ఐక్యత, మానవతా విలువలను పెంపొందిస్తాయి" అని రాజ్ ఠాగూర్ పేర్కొన్నారు. 'రేలి కుల సేవా సంఘం విద్య, ఆరోగ్య రంగాల్లో సేవలందిస్తోంది" అని యుగేందర్ తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని మహోత్సవాన్ని విజయవంతం చేశారు.

## ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలకు సిద్ధంగా స్వయం సేవకులు

చిగురుమామిడి మండలంలో సమ్మేళనం



**చిగురుమామిడి, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి అని కరీంనగర్ సహ సంపర్క ప్రముక్ కుమ్మరికుంట సుధాకర్ జి పిలుపునిచ్చారు. చిన్న ముల్కనూర్ గ్రామంలో తిమ్మాపూర్ ఖండ స్వయం సేవకుల సమ్మేళనం జరిగింది. "1925లో ప్రారంభమైన ఆర్ఎస్ఎస్ ఈ ఏడాది 100 ఏళ్లు పూర్తి చేసుకుంటోంది. దేశానికి మనం ఏమిస్తున్నామనే ఆలోచనతో సంఘం పనిచేస్తోంది" అని సుధాకర్ జి పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా శాఖ కార్యక్రమాలు, పథ సంచలన్, హైందవ సమాజం పాత్రీకరణ వంటి లక్ష్యాలను ప్రతీ స్వయం సేవక్ ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో పుల్లూరి రామారావు, ఆవుల కుమార్ జి, కాముటం వినీత్, సంపత్ జి, నర్సింగ్ జి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలను కౌశిక్ రెడ్డి అయోమయానికి గురిచేస్తున్నారని వొడితల ప్రణవ్ విమర్శ



**కమలాపూర్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుజూరాబాద్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయని కాంగ్రెస్ ఇంచార్జీ వొడితల ప్రణవ్ తెలిపారు.

మొదటి విడతలో 3,500 ఇళ్లు మంజూరు కాగా, వీణవంక మండలంలో గృహ ప్రవేశాలు ప్రారంభమయ్యాయని చెప్పారు. 'పదేళ్లుగా డబుల్ బెడ్ రూంల పేరుతో కాలయాపన చేసిన కౌశిక్ రెడ్డి, ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చూసి ఓర్వలేక ప్రజలను సోషల్ మీడియాలో అయోమయానికి గురిచేస్తున్నారు" అని మండిపడ్డారు. లబ్ధిదారుడు సారయ్య మాట్లాడుతూ, "65 ఏళ్ల కల నిజమైంది. ఇల్లు, ఉచిత విద్యుత్, సన్నబియ్యం, మహాలక్ష్మి బస్ సౌకర్యం అందుతోంది. గృహ ప్రవేశానికి ప్రణవ్ ని ఆహ్వానిస్తాను" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గాంధీభవన్‌లో దళిత కాంగ్రెస్ రాష్ట్ర సమావేశం

-ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి ప్రీతం అధ్యక్షత



**హైదరాబాద్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గాంధీభవన్‌లో ఆదివారం దళిత కాంగ్రెస్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం జరిగింది. తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి ప్రీతం అధ్యక్షత వహించారు. ఏఐసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ రాజేందర్ పాల్ గౌతమ్ ముఖ్యఅతిథిగా పాల్గొని, "రాహుల్ గాంధీ ఆలోచనల మేరకు ప్రతి దళిత కార్యకర్త క్షేత్రస్థాయిలో కృషి చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం కష్టపడి పనిచేసిన వారికి సముచిత స్థానం కల్పిస్తుంది" అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మల్లెపల్లి జగన్, సాయిబాబా, వెంకటేష్, మద్దిలేటి బాలకృష్ణ, పల్లె పోగు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గోపూజ మహోత్సవం

గరుకుస్తంభ ప్రతిష్ఠతో మాణికేశ్వరి ఆలయంలో వేడుక



**కరీంనగర్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వాసవి క్లబ్ కాపుల్స్ కరీంనగర్ ప్రెసిడెంట్ జిల్లా జగదీష్ ఆధ్వర్యంలో మాత మాణికేశ్వరి దేవాలయ గోశాలలో గరుకుస్తంభ ప్రతిష్ఠ మరియు గోపూజ మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అలుగురి రవి దంపతులు, జనరల్ సెక్రటరీ సుద్దాల వెంకటేష్, ట్రెజరర్ బండ అజయ్ రామ్, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నగర్ ఆర్యవైశ్య సంఘం వనభోజనాలు

400 మంది కుటుంబ సభ్యులతో శ్రావణమాస వేడుక



**కరీంనగర్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గణేష్ నగర్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో శ్రావణమాస వనభోజనాలు స్థానిక మాత మాణికేశ్వరి దేవాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాసులు, జిల్లా జగదీష్, బండ అజయ్ రామ్, బోడ్ల శ్రీ కిషన్ గార్ల ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. 400 మంది ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు హాజరయ్యారు. బండ సత్తయ్య, ఉప్పుల రమేష్, కొలిపాక అంజన్న, దేవిశెట్టి నవీన్ కుమార్, యాంసాని భారతి, కన్న కృష్ణ, పాదకంటి శ్రీనివాసు తదితర నాయకులు పాల్గొన్నారు.

## "అవ్వ బాగున్నావా?"

– ఆప్యాయంగా పలకరించిన ప్రణవ్

–కూరగాయలు అమ్ముతున్న మహిళతో ముచ్చట



**హుజురాబాద్–జమ్మికుంట, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జమ్మికుంటలో అయ్యప్ప ఆలయ సమీపంలో కూరగాయలు అమ్ముతున్న ఓ అవ్వను కాంగ్రెస్ ఇంచార్జీ వొడితల ప్రణవ్ ఆప్యాయంగా పలకరించారు. ఆవిడ బాగోగులు అడిగి తెలుసుకుని, ఆదాయం, సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరాలు అడిగారు. అనంతరం కూరగాయలు కొనుగోలు చేసి, "ఏ సమస్య ఉన్నా చెప్పండి, పరిష్కరిస్తాను" అని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు ఆయనతో కలిసి ఉన్నారు.

## “నక్సల్స్ ముక్త్ భారత్ మా లక్ష్యం”

**2026 మార్చి నాటికి నిర్మూలన: కేంద్ర మంత్రి బండి సంజయ్**





**కరీంనగర్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** “నక్సలైట్లతో చర్చలు జరిపి ఏం సాధించారు? తుపాకీ పట్టి అమాయకులను చంపుతున్న నక్సల్స్‌కి మద్దతు ఇవ్వడం దుర్మార్గం” అని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. ఎబివిపి ఆధ్వర్యంలో నిర్వహించిన ‘నక్సల్స్ నరమేధం–మేధోమథనం’ చర్చలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. “బ్యాలెట్, బుల్లెట్ ఒకే ఒరలో ఉండలేవు. 2026 మార్చి నాటికి నక్సలిజాన్ని నిర్మూలించి ‘నక్సల్స్ ముక్త్ భారత్’ సాధిస్తాం” అని స్పష్టం చేశారు.“50 వేల మంది అమాయకులు, 9 వేల మంది పోలీసులు నక్సల్స్ తూటాలకు బలయ్యారు. అభివృద్ధి, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేశారు” అని ఆవేదన వ్యక్తం చేశారు. “నక్సల్స్‌కి మద్దతు ఇచ్చే వారిని విద్యా కమిషన్‌లో నియమించడం సిగ్గుచేటు” అని విమర్శించారు.ఈ కార్యక్రమంలో ఎబివిపి నాయకులు మాదాసి బాబూరావు, అన్నల్ దాస్ మురళి, ముత్యాల రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## జీనియస్ చెస్ అకాడమీ పోటీలకు విశేష స్పందన

**విజేతలకు బహుమతులు, మెమెంటోలు ప్రదానం**



**కరీంనగర్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భగత్ నగర్‌లోని జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ర్యాంకింగ్ చదరంగం పోటీలకు విశేష స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొని తమ మేధాశక్తిని చాటారు.బహుమతి ప్రధానోత్సవానికి రిటైర్డ్ ఆర్మీ మైపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు మెమెంటోలు అందజేశారు. “చదరంగం క్రీడాకారులకు ఏకాగ్రత, విజ్ఞానశక్తి పెరుగుతుంది. భవిష్యత్తులో విజయం సాధించడంలో ఇది దోహదపడుతుంది” అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కంకటి కనకయ్య, అనుప్ కుమార్, సృజన్ కుమార్, తాటిపల్లి సతీష్ బాబు, అరుణ్, కోచ్‌లు అభిరామ్, ప్రభు చంద్ర, నితిన్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## ‘కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి”

**–ఆగస్టు 22న ‘చలో ప్రజా భవన్’ పిలుపు**



**రామగుండం, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపు కోసం జాయింట్ యాక్షన్ కమిటీ (జెఏసి) నేతలు ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ మక్కాన్ సింగ్ కు వినతిపత్రం అందజేశారు. మేదరి సారయ్య (సీఐటీయూ), తోకల రమేష్ (టీయూసీఐ), మద్దెల శ్రీనివాస్ (టీసీకేఎస్) మాట్లాడుతూ, “ఎన్నికల హామీ ప్రకారం వేతనాలు పెంచకపోవడం బాధాకరం. జీవో 22ను గెజిట్ చేయాలి” అని డిమాండ్ చేశారు. ‘ఆగస్టు 22న హైదరాబాద్ ప్రజా భవన్ వద్ద జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్యేలు మద్దతుగా పాల్గొనాలి” అని పిలుపునిచ్చారు.
ఎమ్మెల్యే సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## “క్యాజువల్ కార్మికులను ఆర్టిజన్‌గా గుర్తించాలి”

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు వినతిపత్రం**



**భూపాలపల్లి, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కెటీపీపీ చెల్పూర్ జెన్కోలో గత పది సంవత్సరాలుగా పనిచేస్తున్న 60 మంది క్యాజువల్ కార్మికులు తమను ఆర్టిజన్‌గా గుర్తించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కు వినతిపత్రం అందజేశారు. “మీ సేవలకు గౌరవం దక్కేలా ప్రభుత్వంతో, జెన్కో యాజమాన్యంతో చర్చించి చర్యలు తీసుకుంటాను” అని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## “దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణకు చర్యలు”

**–వర్షాల అనంతరం మరమ్మతులు: కలెక్టర్ దీపక్**



**మంచిర్యాల, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణ పనులు నీటి ప్రవాహం తగ్గిన తర్వాత చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. కోటపల్లి మండలం ఎదులబంధం గ్రామంలో చెరువు పక్కన పాక్షికంగా దెబ్బతిన్న ఆర్–బి రోడ్డును తహసీల్దార్ రాఘవేందర్ రావు, ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. “వరద ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి. ప్రాజెక్టులు, వాగుల వద్దకు వెళ్లకూడదు. అత్యవసర సమయాల్లో మాత్రమే బయటకు రావాలి” అని సూచించారు.నస్పూర్‌లోని కంట్రోల్ రూమ్ 08736–250501 ద్వారా 24 గంటల సహాయం అందుబాటులో ఉందని తెలిపారు. వర్షాలు ఆగిన తర్వాత కల్వర్టు మంజూరు చేసి తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## “శాతవాహన సైనికస్” జట్టుకు చౌటపల్లి వంశీకృష్ణ ఎంపిక

**తెలంగాణ కబడ్డి ఛాంపియన్స్ ట్రోఫీలో ఘనత**



**హుస్నాబాద్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర కబడ్డి ఛాంపియన్స్ ట్రోఫీలో చౌటపల్లి జాతీయ స్థాయి క్రీడాకారుడు పులికాశి వంశీకృష్ణ “శాతవాహన సైనికస్” జట్టుకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని సిద్దిపేట జిల్లా కబడ్డి సంఘం ఉపాధ్యక్షుడు చౌటపల్లి తాజ, మాజీ సర్పంచ్ గద్దల రమేష్ తెలిపారు. “ఇటువంటి నైపుణ్యం కలిగిన క్రీడాకారులను తయారు చేయడానికి గ్రామ సీనియర్ క్రీడాకారులు ఎల్లప్పుడూ కృషి చేస్తారు” అని పేర్కొన్నారు.

## వేమునూరీ రవీందర్ రెడ్డి కుమార్తె వివాహానికి హాజరైన మంత్రి వివేక్

**నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి**



**మంథని, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహాదేవపూర్ మండలంలోని బొమ్మపూర్ గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వేమునూరీ రవీందర్ రెడ్డి కుమార్తె వివాహానికి మంత్రి వివేక్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతి




**దేవరకొండ, ఆగష్టు 17. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
నల్గొండ జిల్లా డిండి మండలం బొలనపల్లి దగ్గర ఆదివారం నాడు ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మరణించిన వ్యక్తి వివరాలు చెరుకుపల్లి గ్రామానికి చెందిన ముడీ శ్రీను ముడీ రాములు అను ఇద్దరు వ్యక్తులు వారి పనుల నిమిత్తం బొల్లనపల్లి గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా సరిగ్గా పెద్ద తండా గ్రామ సమీపంలో కి వచ్చేసరికి వారికి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ను ఒక పక్క నుంచి ఢీకొనగా వెనక కూర్చున్నటువంటి ముడి రాములు వయస్సు 58 సంవత్సరాలు వ్యక్తి తలకు బలమైన గాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందారుమరియు ముడి శ్రీను అను వ్యక్తికి కూడా బలమైన రక్త గాయాలు కాగా అతని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించడం జరిగింది. ఇట్టి విషయంలో డిండి ఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయనైనదని తెలిపారు.

## “ప్రజా శ్రేయస్సే లక్ష్యం”

**రేషన్ కార్డులు, కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**



**రామగుండం, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దంపేట గ్రామంలో 32 మంది పేదలకు తెల్ల రేషన్ కార్డులు, 5 మందికి కళ్యాణలక్ష్మి చెక్కులు ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.“సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేతల ప్రభుత్వంగా ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తోంది. రైతులకు సాగునీరు, గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నాం” అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ముర్మూర్ ఎత్తిపోతల పథకం, 3 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు, రైతు సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తూము రవీందర్ పటేల్, కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ఆర్జీపీఆర్ఎస్ జిల్లా సమావేశం ఘనంగా

**గ్రామస్థాయి నాయకత్వ బలోపేతమే లక్ష్యం**



**కరీంనగర్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ (ఆర్జీపీఆర్ఎస్) జిల్లా స్థాయి సమావేశం కరీంనగర్ కాంగ్రెస్ కార్యాలయంలో జరిగింది. జిల్లా చైర్మన్ మడుపు మోహన్ అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి జాతీయ సమన్వయకర్త ఇమామ్ హసన్, రాష్ట్ర జోనల్ ఇంచార్జ్ మోత్కురి నవీన్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. “గ్రామస్థాయి నుంచి అసెంబ్లీ స్థాయి వరకు నాయకులను తీర్చిదిద్దడమే ఆర్జీపీఆర్ఎస్ లక్ష్యం. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, స్థానిక వనరుల పరిరక్షణపై చైతన్యం కలిగించే నాయకత్వం అవసరం” అని నేతలు పేర్కొన్నారు. ఈ సమావేశంలో వెలిచాల రాజేందర్ రావు, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, కర్ర సత్య ప్రసన్న రెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు. గతంలో పోటీ చేసిన పీఆర్ఐ, యూఎల్బి అభ్యర్థులు తమ అనుభవాలను పంచుకున్నారు.

## రేణిగుంటలో మెగా వైద్య శిబిర ప్రారంభం

**–మంత్రి వివేక్‌కు ఘన స్వాగతం**





**రేణిగుంట, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నెహ్రూ మైదానంలో మాజీ మంత్రి పరసా రత్నం ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించేందుకు మంత్రి వివేక్ రేణిగుంటకు చేరుకున్నారు.
ఈ సందర్భంగా అభిమానులు ఘజమాలతో స్వాగతం పలికి, సత్కారం చేశారు.

## భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలు



**ఇబ్రహింపట్నం ఆగస్టు 17( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
శ్రావణమాసం చివరి ఆదివారం సందర్భంగా బోనాల పండుగ సందర్భంగా అమ్మవారికి బోనం సమర్పించిన జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకట రమణారెడ్డి కుటుంబ సభ్యులు ఈ బోనాల ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి , బిఆర్ఎస్ యువ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు .

# చైనాలో ఆకస్మిక వరదలు

### 8 మంది మృతి



**చైనా ఆగస్టు 17(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
చైనాలో సంభవించిన ఆకస్మిక వరదల్లో కనీసం ఎనిమిది మంది మరణించారని ఆ దేశ వార్తా సంస్థ జిన్హువా ఆదివారం నివేదించింది. ఈ వరదల్లో మరో నలుగురు గల్లంతు కాగా, వారిని వెతుకులాట కొనసాగిస్తున్నారు. ఇన్నర్ మంగోలియా ఉత్తర ప్రాంతంలో శనివారం (ఆగస్టు 16) రాత్రి 10 గంటల ప్రాంతంలో వరద సంభవించిందని, క్యాంపింగ్ ట్రిప్‌లో ఉన్న 13 మంది కొట్టుకుపోయారని, ఒకరిని రక్షించారని నివేదిక తెలిపింది. గల్లంతు అయిన వారి కోసం అన్వేషణ, రక్షణ కార్యకలాపాలు ఇంకా కొనసాగుతున్నాయని జిన్హువా తెలిపింది.

# పాకిస్థాన్ అధ్యక్షుడిగా ఆసిమ్ మునీర్..

### ఆర్మీ చీఫ్ ఏమన్నారంటే?



**ఇస్లామాబాద్ ఆగస్టు 17(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పాకిస్థాన్ తదుపరి అధ్యక్షుడిగా ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ బాధ్యతలు చేపట్టనున్నారని జోరుగా ప్రచారం జరుగుతున్నది. ప్రస్తుతం ఆ పదవిలో కొనసాగుతున్న ఆసిఫ్ అలీ జర్దారీని తొలగిస్తారని, ఆయన స్థానంలో మునీర్ నియమితులవుతారని గత కొంతకాలంగా వార్తలు వెలువడుతున్నాయి. దీనిపై తాజాగా మునీస్ స్పందించారు. అవన్నీ వట్టి పుకార్లేనని కొట్టిపారేశారు. పాక్ నాయకత్వంలో ఎలాంటి మార్పులు జరిగే అవకాశం లేదన్నారు. అధ్యక్షుడు జర్దారి తొలగింపు గురించి వస్తున్నవన్నీ గాలి వార్తలేనని స్పష్టం చేశారు. ఇది రాజకీయ కుట్రలో భాగంగానే అవస్థవాలను ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# జమ్ముకాశ్మీర్‌లో మరోసారి క్లౌడ్ బరెస్ట్ ..

### ఏడుగురు మృతి



**న్యూఢిల్లీ ఆగష్టు 17(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
జమ్మూకాశ్మీర్‌లోని కథువా జిల్లాపై మరోసారి క్లౌడ్ బరెస్ట్ విరుచుకుపడింది. దీంతో ఏడుగురు మరణించగా, పలువురు గాయపడ్డారని అధికారులు ఆదివారం తెలిపారు. ఈ వారం జమ్మూకాశ్మీర్‌లోని కిష్త్వార్‌లో క్లౌడ్ బరెస్ట్ కారణంగా 50మందికి పైగా మరణించగా, 100మందికి పైగా గాయపడిన సంగతి తెలిసిందే. జాంగ్లోట్‌లోని ఒక గ్రామంలో శనివారం అర్ధరాత్రి క్లౌడ్‌బరెస్ట్‌తో మెరుపు వరదలు సంభవించాయి. జిల్లా వ్యాప్తంగా భారీ నుండి అతి భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని కథువా జిల్లా సమాచార కేంద్రం హెచ్చరించింది. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని ఆదేశించింది. వరదల కారణంగా నదుల, వాగుల్లో నీటి ప్రవాహం వేగంగా పెరిగే అవకాశం ఉందని, వర్షాలకు కొండచరియలు విరిగి పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. 01922-238796 మరియు 9858034100 హెల్ప్‌లైన్ నెంబర్లను విడుదల చేసింది. భారీ వర్షపాతం కారణంగా నదుల్లో ప్రవాహం గణనీయంగా పెరిగిందని, ఉజ్ నది ప్రమాద హెచ్చరికకు దగ్గరగా ప్రవహిస్తోందని సంబంధిత అధికారులు తెలిపారు. ఈ తుపాను కారణంగా రైల్వేట్రాక్, జాతీయ రహదారి 44, పోలీస్ స్టేషన్ దెబ్బతిన్నాయని ఉధంపూర్ పార్లమెంట్ సభ్యుడు, కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. పోలీసులు, సైన్యం మరియు పారామిలటరీ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని ఎక్స్‌లో పేర్కొన్నారు. మృతులకు సంతాపం ప్రకటించారు. ఈ ఘటనపై జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా విచారం వ్యక్తం చేశారు. కథువా జిల్లాలో సహాయ రక్షణ మరియు తరలింపు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కథువాలోని జోద్‌ఖాడ్, జుతానాతో సహా అనేక ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటం వలన ప్రాణనష్టం జరిగిందని అన్నారు. ఈ ప్రమాదంలో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారని అన్నారు. వారికుటుంబాలకు సానుభూతి ప్రకటించారు.

# ఢిల్లీలో డేంజర్ బెల్స్..!


### యమునా నదికి భారీ వరద..



**ఆగష్టు 17(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
దేశవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు నగర ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఇప్పటికే హైదరాబాద్, ముంబైలో చినుకు పడితే చాలు వాహనదారులు, లోతట్టు కాలనీ వాసులు నరకయాతన అనుభవిస్తున్నారు. తాజాగా ఢిల్లీ కూడా వరద ముప్పును ఎదుర్కొంటోంది. యమునా నది (Yamuna River) మరో రెండు రోజుల్లో ఉగ్రరూపం దాల్చనుండడమే అందుకు కారణం. అప్రమత్తమైన ఢిల్లీ ప్రభుత్వం ప్రజలకు ఆదివారం ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. హర్యానాలోని హత్నికుండ్ బ్యారేజ్ నుంచి నీటిని విడుదల చేయడంతో యమునా నిండుకుండలా మారింది. ఆదివారం ఉదయం 1.76లక్షల క్యూసెక్కుల నీరు యమునాకు చేరింది. ఇదే విధంగా వరద నీరు వస్తే.. సోమ, మంగళవారం ఉదయం 2 గంటల నాటికి నదిలో 206 మీటర్ల మేర నీరు చేరనుందని వరద నియంత్రణ విభాగం తెలిపింది. నదిలో నీటి ప్రవాహం పెరుగుతున్నందున అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. రాబోయే వరదను ఎదుర్కొనేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. అందులో భాగంగానే లోతట్టు ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని సూచించింది వరద నియంత్రణ విభాగం. మరోవైపు యమునాలో నీటి ఉద్ధృతి పెరగడంతో హర్యానాలోని ఫరీదాబాద్ గ్రామంలోని పలు ఇళ్లలోకి నీరు చేరింది. అక్కడి రోడ్లన్ని చెరువును తలపిస్తున్నాయి.

# గుజరాత్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.

### -రెండు వాహనాలు ఢీకొని ఏడుగురు సజీవ దహనం..!



**న్యూఢిల్లీ ఆగష్టు 17(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
గుజరాత్‌లోని సురేంద్రనగర్ జిల్లాలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కనీసం ఏడుగురు మరణించారు. దేదాదర గ్రామం సమీపంలో స్విఫ్ట్ డిజైర్ కారు, టాటా హారియర్ ఎస్‌యూవీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసు అధికారులు ధ్రువీకరించారు. ఈ ప్రమాదం చాలా తీవ్రంగా ఉండడం వెంటనే వాహనాన్ని మంటలు అలుముకున్నాయి. వాహనంలోనే ప్రయాణికులంతా చిక్కుకుపోయారు. సమాచారం మేరకు మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఘటన జరిగినట్లు సమాచారం. ప్రమాదం తీవ్రత నేపథ్యంలో డిజైర్ వాహనంలో ఉన్న ప్రయాణికులంతా మృతి చెందినట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. గాయపడ్డ వారిని రక్షించి అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. స్థానికులు డిజైర్ వాహనంలో ఉన్న వారిని కాపాడేందుకు ప్రయత్నించినా మంటల్లో ఏడుగురు కాలిపోయినట్లు పోలీసులు పేర్కొన్నారు. వాధ్వన్ పోలీస్ స్టేషన్ నుంచి ఇన్‌స్పెక్టర్ పీబీ జడేజా మాట్లాడుతూ.. 'దేదాదర గ్రామం సమీపంలో మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగిన సంఘటన తర్వాత కారులో ప్రయాణిస్తున్న ఏడుగురు వ్యక్తులు సజీవ దహనమయ్యారని.. ఎస్‌యూవీలో ఉన్న ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారని చెప్పారు. ఈ ఘటనతో రద్దీగా ఉండే హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. వాహనాలు వేగంగా ఉండడం వల్లే అదుపు తప్పి ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నట్లుగా అనుమానిస్తున్నారు. దాంతో మంటలు చెలరేగాయని పలువురు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

# భక్తి భావంతో మానసిక ప్రశాంతత

### - మంచిరెడ్డి కిషన్ రెడ్డి



**యాచారం,ఆగస్టు 17(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ప్రతి ఒక్కరు దైవచింతన అవలంబించుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. యాచారం మండలం గడ్డమల్లయ్యగూడ గ్రామంలో అంగరంగ వైభవంగా "శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ అమ్మవారి విగ్రహం పునః ప్రతిష్ట మహోత్సవంలో" బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి పార్టీ నాయకులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంచి రెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలతో సంతోషంగా ఉండాలని అమ్మవారి కోరుకున్నట్లు తెలిపారు . ఈ కార్యక్రమంలో యాచారం మండలం బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్, బి ఆర్ ఎస్ నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాలో మరోసారి కాల్పుల మోత.

### ముగ్గురు మృతి





**న్యూఢిల్లీ ఆగష్టు 17(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అమెరికాలో మరోసారి కాల్పుల మోత మోగాయి. న్యూయార్క్‌లోని ఓ రెస్టారెంట్‌లో దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందగా.. ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. న్యూయార్క్ సిటీలోని బ్రూక్లిన్ హుక్కా లాంజ్, రెస్టారెంట్‌లోకి ఆదివారం ఉదయం 3.30 గంటలకు (స్థానిక కాలమాన ప్రకారం) పలువురు దుండగులు తుపాకులతో చొరబడ్డారు. అనంతరం అక్కడ ఉన్నవారిపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు పురుషులు మృతిచెందారు. మరో ఎనిమిది మంది గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఐదుగురు పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నారు. కాల్పుల గురించి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. వారికి ఎలాంటి ప్రాణాపాయం లేదని తెలుస్తోంది. కాగా, ఘటనాస్థలిలో 36 బుల్లెట్ శకలాలు లభించాయని పోలీసులు తెలిపారు. అలాగే ఘటనాస్థలికి కొంచెం దూరంలో రహదారిపై ఒక తుపాకీ దొరికిందని పేర్కొన్నారు. అయితే అది ఈ కాల్పుల్లో ఉపయోగించిందేనా? కాదా? అనేది స్పష్టత రావాల్సి ఉందని చెప్పారు. న్యూయార్క్ నగరంలో ఇలా కాల్పులు జరగడం ఈ నెలలో ఇది రెండోసారి. ఆగస్టు 9వ తేదీన టైమ్ స్క్వేర్ సమీపంలో ఒక టీనేజర్ జరిపిన కాల్పుల్లో ముగ్గురు గాయపడ్డారు.

# వాడిన వంట నూనెతో వైమానిక ఇంధనం

### ఇండియన్ ఆయిల్ రిఫైనరీకి సర్టిఫికేషన్





**న్యూఢిల్లీ ఆగష్టు 17(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వేపుళ్ల వంటివాటి కోసం ఒకసారి ఉపయోగించిన వంట నూనెను పారబోసేస్తూ ఉంటారు. ఇటువంటి నూనెతో సుస్థిర వైమానిక ఇంధనం (సుస్టెయినబుల్ ఏవియేషన్ ఫ్యూయల్)ను తయారు చేయడానికి ఇండియన్ ఆయిల్ రిఫైనరీకి సర్టిఫికేషన్ లభించింది. హర్యానాలోని పానిపట్ రిఫైనరీకి ఈ సర్టిఫికేషన్ లభించినట్లు ఈ కంపెనీ చైర్మన్ అరవిందర్ సింగ్ సాహ్నీ తెలిపారు.

మన దేశంలో ఈ సర్టిఫికేషన్‌ను పొందిన ఏకైక కంపెనీ తమదేనన్నారు. పెట్రోలియమేతర పదార్థాల నుంచి తయారు చేసే ప్రత్యామ్నాయ ఇంధనమే ఎస్ఏఎఫ్. ఈ ఇంధనాన్ని వాడటం వల్ల గగనతల రవాణా నుంచి ఉద్గారాలు తగ్గుతాయి. సంప్రదాయ ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్ లేదా జెట్ ఫ్యూయల్)లో 50 శాతం వరకు ఈ ఎస్ఏఎఫ్‌ను కలపవచ్చు.

# శ్రీ శ్రీ శ్రీ జగజ్జనని కాళికా మహాదేవి ముఖద్వారము శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**దేవరకొండ,ఆగష్టు 17(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
చింతపల్లి మండలంలోని అంగడి కుర్మపల్లి గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ జగజ్జనని కాళికా మహాదేవి ముఖద్వారము శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం నాడు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే బాలు నాయక్ ముఖద్వారాన్ని శంఖుస్థాపన చేశారు. జగజ్జనని కాళికా మహాదేవి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం గ్రామస్తుల సమస్యలను విని తక్షణమే స్పందించి, వారి సమస్యలను పరిష్కారించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగజ్జనని కాళికా మహాదేవి అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ దేవరకొండ ప్రాంత ప్రజలపై ఉండి, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు,మండల ముఖ్య నాయకులు,మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు ,యూత్ కాంగ్రెస్ నాయకులు , ఎన్ఎస్యుఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.